కథ

ధరణికోట శివరాంప్రసాద్

# చీకటి ప్రయాణం

"సార్! ఈ పర్సు మీదేనా?" నిజాయితీ ఉట్టిపడే గొంతు వినపడి, ఉలిక్కిపడి జేబు తడుముకున్నాడు ముకుందం. తన జేబులో తన పర్సు భద్రంగా వుండడంతో ఊపిరి పీల్చుకున్న ముకుందం తన ఎదురుగా చేతిలో పర్సుతో నిలబడివున్న టీనేజ్ కుర్రాడిని చూసాడు. అప్పటివరకూ కంపార్ట్‌మెంటంతా తుడిచి అడుక్కున్నది వాడేనని గుర్తుపట్టాడు. చురుగ్గా ఆలోచించింది ముకుందం బుర్ర. చుట్టూ పరికించి చూసాడు. ఎవరిపాటికి వారు నిద్రలో జోగుతున్నారు. ఎదురుగా వున్న సీట్లో నడివయస్కుడు పెడుతున్న గురక, రైలుకూతకు పోటీగా వుంది. పక్కసీట్లలో మనిషి మేలుకున్న జాడాలేదు. ఎవరూ తనను గమనించలేదని నిర్ధారించుకుని "షిట్.... నాదే పర్సు... ఎక్కడో పడిపోయింది" స్పాంటేనియస్‌గా అబద్ధం చెప్పాడు ఎలాంటి తడబాటు లేకుండా.

కుర్రాడు ముకుందం చేతిలో పెట్టాడు పర్సు.

ఒళ్ళు జల్లుమంది పర్సు బరువుగా తగలడంతో.

కరెన్సీ నోట్లకు అలవాటు పడ్డ ముకుందంలోని 'మనీషి' ఆ బరువును అంచనా వేస్తూ, లోపల ఉప్పొంగుతున్న మానసికానందాన్ని క్షణకాలం తొక్కిపట్టాడు. పర్సును ప్యాంట్ జేబులోకి తోసాడు.

కుర్రాడు దీనంగా చూస్తున్నాడు.

ఎవరో పారేసుకున్న మనీ పర్సుని వీడి అమాయకత్వం వలన తను తెలివిగా నొక్కేసాడు. అమాయకత్వం ఉట్టిపడ్తున్న కుర్రాడికేసి చూసాడు.

"సార్... రెండ్రోజుల్నుండి ఏమీ తిన్లేదు. ఏదైనా ధర్మం..." దీనంగా అడిగాడు కుర్రాడు.

'వీడినెంత తొందరగా వదిలించుకుంటే అంత తొందరగా పర్సు ఓపెన్ చేసి ఎంజాయ్ చెయొచ్చు' క్షణంలో నిర్ణయానికొచ్చాడు ముకుందం.


పైసా విదిల్చే అలవాటులేని ముకుందం, కుర్రాడికి చిల్లర ఇవ్వడానికై జేబులన్నీ వెతుక్కున్నాడు. యాభై రూపాయల నోట్లు తప్ప యింకేం లేకపోవడతో ఓ యాభై కాగితాన్ని కుర్రాడి చేతిలో పెట్టాడు యావదాస్తి పోతున్నంతగా ఫీలయిపోతూ.

తృప్తిగా మెరిసే కళ్ళతో, ముకుందాన్ని చూసి వెళ్ళిపోయాడు కుర్రాడు.

ఆనందంతో ఎగిసి పడుతున్న మనసుని కంట్రోల్ చేసుకుంటూ ప్యాంట్ జేబులో కుక్కిన పర్సుని బయటకు తీయబోయి ఎదుటి సీట్లోని నడివయస్కుడు నిద్రలేవడంతో పర్సు బయటకు తీసే ప్రయత్నం వాయిదా వేసాడు ముకుందం.

తప్పు చేసిన మనిషి అంతరంగం, ఎంత అల్లకల్లోలంగా వుంటుందో అదే స్థితిలో వున్న ముకుందానికి ఎందుకో ఒక్కసారిగా భయమేసినట్లయింది. పరిపరి విధాలుగా మనసు ఆలోచిస్తోంది.

పర్సు పోగొట్టుకున్న వారెవరోగాని, వారిదే కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తుండొచ్చు. పోగొట్టుకున్నట్టు తెల్సుకోగానే బహుశా అందర్నీ చెక్ చెయొచ్చు. డబ్బుతోపాటు విలువైన వస్తువులు కూడా పర్సులో వుండొచ్చు. ప్రయాణికుల్ని చెక్ చేయడమో లేదా మొబైల్ ఫోన్‌తో పోలీస్ కంప్లైంటనా యివ్వవచ్చు.



ఆ ఆలోచన రాగానే-

ఒళ్ళు భయంతో వణికింది.

అప్పటి వరకూ వున్న ప్రశాంతత దూరమవుతున్నట్లనిపించింది. ఇవేమీ పట్టనట్లు ట్రైన్ వేగంగా పరిగెడుతూనే వుంది.

ప్రయాణంలో పదనినలా చిన్నపిల్లాడు ఏడ్వ
పక్కసీట్లో వాడి తల్లేమోలేచింది. గుక్క పట్టి ఏడు
చంటాడి ఏడుపుకి డిస్టర్బ్ అయిన ఓ ముసలి జంట
లింతలు పెడ్తూ గొణుక్కుంటూ లేచి కూర్చున
ఏడుపు క్రమంగా స్థాయి పెరగడంతో ఒక్కొక్క
మేల్కొనడంతో ముకుందానికి చెమటలు మొ
మనసు కీడుని శంకించింది. ప్రయాణీకుల్ని తన ఆ
న్నొక్క రాగంతో మేల్కొలుపుతున్న చంటాడి ఏడు
పర్సు పోగొట్టుకున్న వారినీ లేపుతుంది. తన దొంగ
ఖాన్ని చూసి ఈజీగా గుర్తు పట్టేస్తారేమో! అప్పుడు
పని గోవిందా.. గోవిందే.. తను పట్టుపడ్డాక, ముం
'పర్సుదొంగ'గా తనకో టైటిల్ యిచ్చి, తర్వాత దేహ
శుద్ధి చేయడం ఖాయం. ఆ తర్వాత పోలీసులు,
కోర్టులు... మీడియాలో 'పట్టుబడ్డ పర్సు దొంగంటూ'
ఎక్కడ చూసినా తన గురించే 'యాంటీ పబ్లిసిటీ'. ఆలోచనలతో, ఆందోళనగా మారింది ముకుందం ముఖం.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగడంతో దిగవల్సిన వాళ్ళను పూర్తిగా దిగనివ్వకుండనే దూకుడుగా ఎక్కేస్తున్నారు ప్రయాణికులు. టెన్షన్‌తో సతమతమవుతున్న ముకుందం మనసు మాత్రం నొక్కేసిన పర్సు చుట్టూనే

తిరుగుతోంది. మళ్ళీ ట్రైన్ కదలడంతో బలంగా, నిండుగా వున్న పర్సు కళ్ళ ముందు కదలాడింది ముకుందానికి. పిరికితనంతో భయపడిన ముకుందానికి ఎదురుతిరిగింద తని అంతరాత్మ. తనేం దొంగతనం చేయ లేదు. కావాలని ఎవరి జేబూ కొట్టేయలేదు. ధనలక్ష్మి తనంతట తానుగా వరించి వచ్చిన ప్పుడు, తనెందుకింతలా భయపడటం. కంపార్ట్‌మెంట్‌లో యింతమందుండగా తన దగ్గరకే పర్సు చేరడం నిజంగా తన అదృష్టమే. తెలివైనవాడు అదృష్టాన్ని వుపయోగించుకుంటాడు. తనిప్పుడు చేస్తుందీ అదేగా! మనసుకు సర్ది చెప్పుకున్నాడు. అయినా ఈ ప్రయాణికుల ప్రవాహంలో టిప్ టాప్‌గా వున్న తన మీద గౌరవం కలుగుతుందే తప్ప, తనని చూసి ఎవరికైనా అనుమానం కలగడం ఇంపాజిబుల్. అయినా ఇంకో అర్థగంట ఆగితే తను దిగవలసిన స్టేషన్ వచ్చేస్తుంది. తను దిగిపోతాడు. అప్పుడు ఎలాంటి టెన్షనూ వుండదు. దొరికిన డబ్బుతో కిరాణాషాపువాడి అప్పు తీర్చేసి, ఎప్పటి నుంచో అడుగుతున్న భార్యకు నగలు, సెవెంత్ చదువుతున్న చందుగాడికి బట్టలు, తనకేమో మంచి డ్రస్‌లు కొని, మిగతా డబ్బు బ్యాంక్‌లో వేసుకోవచ్చు ఇలా ఆలోచించగానే...

అప్పటి వరకు మనసులో వున్న భయం పటాపంచలైపోయినట్లు అనిపించి, కాలుమీద కాలు వేసుకుని దర్జాగా కూర్చున్నాడు ముకుందం ఊహల్లోనే తిరిగి తేలిపోతూ.

"ఒంగోలొచ్చింది"

ఎవరో అరవడంతో వాస్తవంలోకి వచ్చి చూసాడు ముకుందం.


ఒంగోలు స్టేషన్.

తెల్లవారిందప్పుడే.

ప్లాట్‌ఫారమ్ నిండా ఇసకేస్తే రాలనట్లున్న జనాలు తోసుకుంటూ ట్రైన్‌లోకి ఎక్కేస్తుంటే దిగవల్సిన ప్రయాణికులు గోలపెడ్తున్నారు.

సూట్‌కేస్‌తో జనాలను నెట్టుకుంటూ ఎలాగైతేనేం ట్రైన్ దిగాడు ముకుందం. హుషారుగా విజిల్‌వేస్తూ, స్టేషన్ బయటకు వచ్చి ఆగివున్న ఆటో ఎక్కి "కోర్టు సెంటర్" అన్నాడు.

ఆటో కదిలింది. వెళ్తున్న ఆటోకంటే వేగంగా ఆలోచిస్తూ బరువుగా వున్న పర్సును బయటకు తీశాడు ముకుందం. ఏన్నో ఏళ్ళుగా కరెన్సీ నోట్లను మోస్తున్న పాతకాలపు పర్సులా వుందది. ఉత్సాహంతో ఉక్కిరి బిక్కిరవుతూ పర్సు తెరిచాడు.




ఏవో... కాగితాలు.

ముఖ కవళికలు మారుతుండగా చకచకా వెతికాడు ముకుందం.

సందేహం లేదు...

అన్నీ చిత్తు కాగితాలు...

మరో అరలో...

చిన్నపాటి గులకరాళ్ళు...

తను నగదుగా భావించినవి చిత్తు కాగితాలు, నగలుగా అనుకున్నవి గులకరాళ్ళు...

మెదడంతా మొద్దు బారినట్లయింది. తను మోసగించబడ్డట్టు అర్థమైన ముకుందానికి సీక్రెట్ అరలో కనపడ్డ తెల్లకాగితం కనిపించింది. ఆత్రంగా ఓపెన్ చేసాడు.

ఏదో రాసుంది.

అందమైన దస్తూరి.

నీరసం ఆవహిస్తుండగా అక్షరాల వెంట పరిగెత్తాయ్ ముకుందం కళ్ళు.

"నీకు నమస్తే.. అని చెప్పడానికి సిగ్గుగా వుంది.

అనాథలమై అడుక్కునే మాలాంటి వారికి చూస్తూ సాయం చేసే మనసు లేదు మీకు. మీరు కూర్చునే సీట్ల కిందాపైనా వూడ్చే మా 'చేతుల్లో' పైసా పెట్టడానికి మీకు 'చేతులు' రావు. కానీ ఫ్రీగా వస్తే 'చేతులు చాచే' 'దుర్బుద్ధి' మాత్రం మీలాంటి వారిలో పుష్కలం. మేం కనిపిస్తే ముఖం మాత్రం పక్కకు తిప్పుకుంటారు, అది మీ నైజం. మీది కాని పర్సును మీ సొంతం చేసుకునేందుకై ఆశపడి నాకు బిచ్చమేసారు కాని, నిజానికి రూపాయి కూడా ఇవ్వరు. మీరు నా 'అమాయకత్వాన్ని' 'క్యాష్' చేసుకోవాలనుకుంటే నేను మీ 'దుర్బుద్ధిని' 'క్యాష్' చేసుకున్నా. తప్పా!

మీలాంటి మనుషులను నేనెంతో మందిని చూశా. 'ఈ పర్సునాది కాదు' అని నిజాయితీగా చెప్పే మనిషి కోసం, నేను చేస్తున్న ప్రయాణంలో ఒకరూ దొరక్క ఓడిపోతూనే వున్నా- కానీ జీవితంలో ఒక్కసారైనా-'ఒక్క నిజాయితీ పరుడు' 'ఒక్కడైనా' కన్పిస్తాడేమోనన్న ఆశతోనే నేను రోజూ చేసే ఈ 'చీకటి ప్రయాణం'

మరో పర్సుతో...

మరో ట్రైన్ ఎక్కాలి...

ఉంటాను...

-ఒక ఆశాజీవి"

చదువుతున్న ముకుందం ముఖం మీద ఎవరో చెళ్‌మని చెరిచినట్లయింది.

"సార్ దిగండి"

ఆటోవాలా పిలుపుతో ఆటో దిగి, ఆటో వాడికి డబ్బు యిద్దామని జేబులో చెయ్యి పెట్టిన ముకుందం 'కరెంట్ షాక్' కొట్టినట్లు ఉలిక్కిపడ్డాడు.

జేబులో వుండవల్సిన 'తన పర్సు' లేదు.

☆

## జియా కొత్త ప్రేమ

'నిశ్శబ్ద్' తార జియా ఈ ఒక్క చిత్రంతోనే అందరి దృష్టిలోకీ వచ్చేసింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా కూడా ఆమె ధరించిన పాత్ర ఆమెకి అలాంటి గుర్తింపుని తెచ్చింది. అమితాబ్ 'ముసలాడ్ని' లవ్వాడే పాత్రంటే గుర్తింపు రాదా మరి! ప్రస్తుతం అమీర్ ఖాన్‌తో 'హిందీ గజినీ'లో నటిస్తున్న జియా మరో కొత్త ప్రేమతో వార్తల్లోకొస్తోంది. ఇటలీకి చెందిన ఓ రాజవంశీకుడితో దోస్తీ చేస్తూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోందిట. ఈ సంగతే ఆమెని అడిగితే- 'ప్రేమా పెళ్లీ లాంటి వాటికి నేనింకా చిన్నపిల్లనే. ఏదో సర్దాగా ఫ్రెండ్షిప్ అంతే' అంటూ తేల్చిపారేస్తోంది. పిట్ట కొంచెం కూత ఘనం అంటే ఇదేనేమో!

